అదుపులో డయేరియా

- నాలుగు రోజులుగా మూతపడిన
- మాంసం, చేపల దుకాణాలు

గోపాలపురం: వారం రోజులుగా మండలాన్ని హడలెత్తించిన అతిసార తగ్గుముఖం పట్టింది. ఇప్పటికే డయేరియా బారిన పడి సుమారు 35 మంది రోగాల నుండి బయటపడ్డారు. నాలుగు రోజులుగా డయేరియా సోకిన గ్రామాలే కాకుండా మండలంలోని అన్ని గ్రామాలలోనూ మాంసం, చేపల విక్రయాన్ని నిషేధించారు. దీంతో ఆదివారం మాంసం ప్రియులు కోడి, మేక, చేపలు అందకపోవడంతో నానా అవస్థలు పడ్డారు.

ఆందోళన వద్దు

మండలంలో డయేరియా అదుపులో ఉందని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యుడు కె.నవీన్‌కుమార్ తెలిపారు. గోపాలపురం, వేళ్లచింతలగూడెం, చిట్యాల, గుడ్డిగూడెం, దొండపూడి, హుకుంపేట గ్రామాలలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. ఏఎన్ఎంలు గ్రామంలో పర్యటించి తాగునీటిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంచినీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరిగిందని మంచినీటిలో ఎటువంటి అవశేషాలు లేవని తేలిందని ఆయన తెలిపారు. వ్యవసాయ కూలీలకు పొగాకు కూలీలు తీసుకునే ఆహారంలో తగిన జాగ్రత్తలు పాటించాలని చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు.



గోపాలపురంలో మూతపడిన మాంసం చేపల దుకాణాలు

కనీస వేతనాలు అందించాలి

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌ల ఆందోళన

నల్లజర్ల: కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ జిల్లా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లు 12 మంది ఆందోళన చేపట్టినట్టు ఆ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు రామదాసు, అరవాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 31తో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102)టెండర్ ముగియనుందని, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలను గమ్య స్థానాలకు చేర్చడం అత్యంత నైపుణ్యంతో పనిచేస్తున్నామని, కానీ తొమ్మిదేళ్లుగా కెప్టెన్‌లకు కేవలం రూ.7,800 వేతనంతో పని చేస్తున్నామన్నారు. ఈ అరకొర జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఈసారి టెండర్లు పిలిచినపుడు కెప్టెన్స్ (డ్రైవర్ల)జీతాలను దృష్టిలో ఉంచుకొని సమాన పనికి, సమాన వేతనం అందేలా కనీస వేతనం రూ.18,500 వచ్చేలా చూడాలని, బీమా, ఇతర అలవెన్స్‌లు కల్పించాలని కోరుతూ జిల్లా మేనేజరు నాగూర్‌కు వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. తమ సమస్య పరిష్కరించని పక్షంలో తాము ఆందోళన చేపట్టవలసి వస్తుందన్నారు. ఈ సమావేశంలో శివాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా మేనేజర్ నాగూర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లు

క్లుప్తంగా

స్వయం ఉపాధి యూనిట్ల దరఖాస్తుల గడువు పెంపు

దేవరపల్లి: స్వయం ఉపాధి సోపానం యునిట్లు రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్టు ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కాపు కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తుదారుని వయో పరిమితిని 50 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచినట్టు ఆయన తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

వారిని కఠినంగా శిక్షించాలి

నల్లజర్ల: దూబచర్ల గాంధీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి, ముసుళ్ళగుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు.

విజయవంతమైన ఉల్లాస్ పరీక్షలు



కానూరులో పరీక్ష రాస్తున్న అభ్యాసకులు

పెరవలి: జిల్లాలో నిరక్షరాస్యులు ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంలో వయోజన విద్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలు విజయవంతం అయ్యినట్టు ఏపీఎం బి.రామకృష్ణ తెలిపారు. ఈ ఉల్లాస్ పరీక్షల్లో 700 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 696 మంది హాజరైనట్టు తెలిపారు. మండలంలోని 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేసి అందులో అభ్యాసకులు ఈ రోజు పరీక్షలు రాసినట్లు చెప్పారు. పరీక్షలు పూర్తయిన అనంతరం పరీక్షా పేపర్లను వెలుగు కార్యాలయానికి అందించినట్లు తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో కె.సావరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఈనెల 24, 25, 26 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు



నిడదవోలు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు ఆదివారం సాగునీటి విడుదలను పెంచారు. గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవరులను శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు 5,500 క్యూసెక్కులు, తూర్పుడెల్టాకు 3,200 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1947 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏలూరు కాలువలకు 1332 క్యూసెక్కులు, తణుకు కాలువకు 700 క్యూసెక్కులు, అత్తిలి కాలువలకు 232 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

గ్రామాల్లో నేడు పీ-4 సర్వే సభలు

దేవరపల్లి: దారిద్ర్య రేఖకు దిగువనున్న 20 శాతం కుటుంబాలను గుర్తించడానికి ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన పీ-4 సర్వే నిర్వహించినట్టు ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. హౌస్ హోల్డ్ ధ్రువీకరణ కోసం గ్రామ సచివాలయాల వద్ద సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 8 గంటలకు బందపురం, దుద్దుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, 9 గంటలకు చిన్నాయగూడెం, సంగాయగూడెం, గౌరీపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సభలు జరగనున్నాయన్నారు. 10 గంటలకు దేవరపల్లి, కురుకూరు, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, 11 గంటలకు పల్లంట్ల, మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణంపాలెం, రామన్నపాలెం, ధుమంతునిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు త్యాజంపూడి, 3 గంటలకు యాదవోలు, 4 గంటలకు యర్నగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

హుండీల చోరీ

నిడదవోలు : పట్టణంలో విద్యానగర్‌లో ఉన్న రామకృష్ణ సేవా సమితి కేంద్రంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. కేంద్రంలోని వెనుక భాగంలో తలుపునకు వేసిన తాళం గునపంతో పెకిలించిన దుండగులు లోపలకు వెళ్లి విగ్రహాల వద్ద ఉన్న రెండు హుండీలను అపహరించుకుపోయారు. ఈమేరకు సమితి సభ్యులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలి



దుద్దుకూరులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్వారీ కార్మికులు

- విప్లవవీరులకు ఘన నివాళులు
- వారి సేవలను కొనియాడిన నేతలు

దేవరపల్లి: దుద్దుకూరులోని ప్రగతిశీల కార్మిక సమాఖ్య కార్యాలయం వద్ద ఆదివారం స్వాతంత్ర సమర యోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిత్ర పటాలకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్, క్వారీ కార్మికులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సాయుధ పోరాట మార్గంలో గడగడలాడించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. 1931 మార్చి 23న భగత్ సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌లను ఉరి తీశారన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ముద్రించి విద్యార్థులకు తెలియజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ నాగరాజు, ఉస్సే ప్రసాద్, టి.సత్యనారాయణ, శివాజీ, ఎలిపెం చంద్రం, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని త్యాజంపూడిలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాయామ సాధన, ఆహార అలవాట్లపై దృష్టి

నల్లజర్ల: మారుతున్న ఆహారపు అలవాట్లు, యాంత్రిక జీవనంలో మానసిక ఒత్తిడితో చిన్న వయస్సుల్లోనే పలువురిలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆర్థోపేటిక్ స్పైన్ సర్జన్ డాక్టరు తేజో ఫణీంద్ర అన్నారు. అనంతపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన వేద హాస్పటల్‌కు చెందిన వెన్నుముక నిపుణులు డాక్టరు తేజోఫణీంద్ర, స్త్రీల వైద్య నిపుణులు డాక్టరు లక్ష్మీమృదుల శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరు మాట్లాడుతూ పనికి తగ్గ ఆహారం తీసుకోవాలన్నారు. శ్రమ లేకపోవడంతో మనం తీసుకునే ఆహారం శరీర భాగాలలో పేరుకుపోయి వాటిని దెబ్బతీస్తాయన్నారు. మాంసకృత్తులు తగ్గించి ఉడికించిన ఆహార పదార్థాలు తీసుకుంటే మంచిదన్నారు. ఉదయం, సాయంత్రం తప్పక వ్యాయామం చేయాలన్నారు. పోషక విలువతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఎముక పటిష్టంగా ఉంటుందన్నారు. ఎముక గుల్లబారితే ఎక్కడ జారిపడ్డా దెబ్బలు తగలడం, ఎముకలు విరిగిపోవడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ రూ.2500 విలువ చేసే ఎముక సాంద్రత పరీక్ష ఉచితంగా చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింహాద్రి, సర్పంచ్ కమలకుమారి, సభ్యులు బళ్ల నాని, బీజేపీ నాయకులు శెట్టిపల్లి శివనాగరాజు, అద్దంకి కృష్ణమోహన్, ప్రత్తి మురళీకృష్ణ, చిట్లా వెంకటేశ్వరావు, ఓలిరెడ్డి సతీష్, వెంగల సతీష్, గ్రామకార్యదర్శి శ్రీదేవి, గన్నమని దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టరు తేజోఫణీంద్ర

వర్జీనియా పొగాకు రైతు సంఘ నూతన కార్యవర్గం



నూతన కమిటీ ప్రతినిధులు

దేవరపల్లి: నూతనంగా దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం వర్జీనియా పొగాకు రైతు సంఘ కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఆదివారం వేలం కేంద్రం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో నూతన కమిటీ సభ్యులు వివరాలను తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కాట్రు వీరవెంకట సత్యనారాయణ(బుచ్చియపాలెం), ఉపాధ్యక్షుడిగా బిక్కిన నాగరాజు(కృష్ణంపాలెం), కార్యదర్శిగా దుద్దుపూడి హరిబాబు(బందపురం), సహాయ కార్యదర్శిగా జానపరెడ్డి వెంకట్రావు(కలవచర్ల), కోశాధికారిగా ఆచంట సత్యనారాయణ(గాంధీనగరం), సలహాదారులుగా నరహరిశెట్టి రాజేంద్రబాబు(యర్నగూడెం), ఆచంట గోపాలకృష్ణ(గాంధీనగరం), పరిమి శ్రీరామకృష్ణారావు(రామన్నపాలెం), సభ్యులుగా సుంకవల్లి వెంకటశ్రీనివాసరావు(సంగాయగూడెం), పుట్టా దైవవరప్రసాద్(యర్నగూడెం), నాయుడు దుర్గాప్రసాద్(కృష్ణంపాలెం), నలమాటి నాగేశ్వరరావు(పల్లంట్ల), ఉండవల్లి వెంకటసత్తిబాబు(ధుమంతునిగూడెం), ముమ్మారెడ్డి సత్యనారాయణ, రాపాక శ్రీను(రామన్నపాలెం), గెల్లా నాగవెంకట దుర్గాప్రసాద్(కొత్తగూడెం), గన్నమని గోపాలకృష్ణ, నందిగం శ్రీధర్(దేవరపల్లి), సుంకర రాంబాబు(బందపురం), దుగ్గిన రాజేశ్వరరావు(దుద్దుకూరు), ముళ్లపూడి శివాజీ (చెరుకుమిల్లి), గెడ్డం రామారావు(సీతానగరం), చంద్రాల పెదవెంకన్నదొర (మురారి) నియమితులైనట్టు అధ్యక్షులు వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. నూతన కమిటీని రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. ఏడేళ్ల నుంచి రిజిస్టర్డ్ కమిటీ లేదని చెప్పారు. సోమవారం ఉదయం 5.30కు పొగాకు వేలం ప్రారంభమవుతుందని, నూతన బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ హాజరవుతారన్నారు.

కొవ్వూరు నుంచి కృష్ణ సాగర సంగమ దివి సీమ యాత్ర

కొవ్వూరు: పట్టణంలో ఆర్టీసీ డిపో నుంచి కృష్ణ సాగర సంగమ దివిసీమ యాత్ర స్పెషల్ బస్సు ఆదివారం బయలుదేరినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఈనెల 27వ తేదీన రెండో బస్సు, ఏప్రిల్ ఒకటిన మూడో బస్సును పంపించనున్నట్టు డీఎం తెలిపారు. ఈ మూడు బస్సులతో పాటు మరో రెండు బస్సులకు యాత్రీకులు బుకింగ్ చేసుకున్నారని అన్నారు. ఇటీవల కోనసీమకి, మన్యం సీమ స్పెషల్ బస్సులు నడిపామని, ఇప్పుడు దివి సీమకి స్పెషల్ బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులతో కలిపి ఇప్పటి వరకు డిపో నుంచి 124 స్పెషల్ బస్సులను నడిపినట్టు డీఎం తెలిపారు.

సీఎం సహాయ నిధి సాయం అందజేత

కొవ్వూరు: ఆరోగ్య పరమైన సమస్యలతో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన సాయాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. లాగుడు రాజబాబుకి రూ.24,140, సకుమళ్ల కుమారికి రూ.1,43,026, కర్రి గుణ దీపికకి రూ.27,501, చిత్రాడ లక్ష్మి మౌనికకి రూ.33,695 చొప్పున ఆర్థిక సాయం చెక్కులను ఆయన అందజేశారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు

నిడదవోలు: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మసీదు ముతవల్లి అజీజ్‌భాషా, పట్టణ జనసేన నాయకులు తదితరులు ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం

ఉండ్రాజవరం: అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పసలపూడి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని, ఆ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ ఏఈ పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పలు శాఖల అధికారులు వారి పరిధిలో అభివృద్ధిని తెలిపారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఏప్రిల్‌లో వచ్చే మండల, జెడ్పీ నిధుల నుంచి వాటిని పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొని క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార పదార్థాలను అందజేశారు. అనంతరం క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుంది అనే పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, చెట్టే నవీన్, ఎంపీడీవో వివివి ఎస్.రామారావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ, ఆశాజ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక
- ఎంబుక్ కనిపించడం లేదని ఎంపీటీసీ ఆవేదన
- కూటమి నాయకుల పనేనని ఆరోపణ

పెరవలి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన నాయకులు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటి ఎద్దడి నాలుగు గ్రామాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నిడదవోలు నియోజక వర్గాన్ని మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దటానికి తన వంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇదే సమయంలో క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందించారు.

ఈ సమావేశంలో ఆశక్తికరమైన విషయం ఒకటి జరిగింది. ఖండవల్లి పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాలకు మట్టి పూడిక జరిగింది. దీనికి సంబంధించిన ఎం బుక్క్ గ్రామ పంచాయతీలో ఉండగా గత నాలుగు నెలలుగా ఈ బుక్ కనిపించటంలేదని కార్యదర్శి అంటున్నారని ఇదేం దారుణమని ఆ గ్రామ ఎంపీటీసీ బొకె వెంకటేశ్వర్లు, రవి సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీపీ సదరు కార్యదర్శి చక్రవర్తిని ప్రశ్నించగా ఎం బుక్ కనిపించడం లేదని సమాధానం చెప్పారు. ఆ బుక్‌లో ఇంకా రూ.1.20 లక్షలు రాయాల్సి ఉందని కూటమి నాయకులు ఈ విధంగా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సభ్యుడు అంటున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఎంపీటీఓ సీహెచ్ వెంకట రమణ, తహసీల్దార్ డి.అత్యుత కుమారి, ప్రత్యేక అధికారి ఎం.సునీల్ వినయ్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఎం బుక్ కోసం నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు

వేంకటేశ్వరస్వామి ఆవిర్భావ దినోత్సవం

ఉండ్రాజవరం : వెలగదుర్రు గ్రామంలో స్వయంభూగా వెలిసిన అలివేలు మంగ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలో నగర సంకీర్తన, పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉండ్రాజవరం, వెలగదుర్రు, రాజమండ్రి భక్తి సమాజాలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

కొవ్వూరు పట్టణంలో..

కొవ్వూరు: పట్టణంలో బసివిరెడ్డిపేటలో రాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమైనట్టు ఆలయ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుప్రభాత సేవ, ఆరాధన, బాల భోగ నివేదన, తీర్థ గోష్టి, మహా పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామి వారికి చక్రసాన్నం నిర్వహించనున్నట్టు తెలిపారు.



వెలగదుర్రులో వేంకటేశ్వర స్వామి

చలివేంద్రాల ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్: వేసవిలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈచలివేంద్రాలు ఏర్పాటుచేసిన గొందేశి యువసేన, కైఫ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులను ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి అభినందించారు. ఆదివారం బాలాజీపేట సెంటర్‌లోని స్వర్గీయ గొందేశి పూర్ణచంద్రారెడ్డి విగ్రహం వద్ద గొందేశి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గొందేశి యువసేన నేతలు సూరంపూడి ప్రకాష్, రాయుడు ప్రసాద్, రెడ్డి ప్రసాద్, వడ్డీ రాజా, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల అను, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సభ్యులు సుమన్ పాల్, కెవి.సుబ్బారెడ్డి, సీతారాంచరణ్, కైఫ్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన శ్రీనివాసులరెడ్డి

విద్యార్థినికి అభినందన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగం నుండి డాక్టర్ కె.అనూష మెంటార్‌షిప్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్ షిప్-2025నకు పి.సాయిశ్రేయ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. అమిటీ యూనివర్సిటీ కోల్‌కతాలో డాక్టర్ భట్టాచార్య ఆశీమ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు.. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, బయోటెక్నాలజీ శాఖాధిపతి డాక్టర్ బి.నాగేశ్వరి విద్యార్థిని అభినందించారు.

దివ్యబలి పూజ సమర్పణ



దివ్యబలి పూజ సమర్పిస్తున్న బిషప్ జయరావు పొలిమెర, ఫాదర్లు

దేవరపల్లి: గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర, నల్గొండ పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ కరణం ధమన్ కుమార్, ఫాదర్ దిరిసిన ఆరోన్, పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్‌లు ఆదివారం రాత్రి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గురువులు, ఫాదర్లు, కన్యలు, భక్తులు పాల్గొన్నారు.

12న పురస్కారాల ప్రదానోత్సవం

సీటీఆర్ఐ: భారతదేశానికి దశ దిశ చూపిన మహానుభావులు పూలే, అంబేడ్కర్ పేరిట మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజుకు పురస్కారాలు అందచేయనున్నట్లు రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 వ తేదీ సాయంత్రం 4 గంటలకు జె.ఎస్.రోడ్డులోని చెరుకూరి కల్యాణ మండపంలో జరిగే సభలో ఈ పురస్కారాలు అందచేస్తామన్నారు.